క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న
అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ

శింగనమల: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయని అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ అన్నారు. మండలంలోని తరిమెలలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు గ్రామీణ క్రీడాకారులకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేత జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. పోటీల్లో 22 జట్లు పాల్గొనగా మొదటి బహుమతి తరిమెల జట్టు , ద్వితీయ బహుమతి అగళి జట్టు, మూడో బహుమతి గార్లదిన్నె జట్టు, నాలుగో బహుమతి ఎం.ఎం. పల్లి జట్లు దక్కించుకున్నాయి కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేసులు, ఎస్ఐ శరత్‌చంద్ర, సర్పంచ్ ఓబిలేసు, ఈశా ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదికి డాక్టరేట్



చెన్నైలో డాక్టరేట్ అందుకుంటున్న
న్యాయవాది దీపక్ దయానంద్

గుత్తి: చెన్నైలోని అమెరికన్ యూనివర్శిటీ ఆదివారం గుత్తి ఆర్ఎస్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది దీపక్ దయానంద్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. సామాజిక సేవలు చేసినందుకు గుర్తింపుగా న్యాయవాదికి డాక్టరేట్ ప్రదానం చేశారు. చెన్నైలోని అమెరికన్ యూనివర్శిటీ నిర్వాహకుల నుంచి దీపక్ దయానంద్ గౌరవ డాక్టరేట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

రైల్వే ఉద్యోగి ఆకస్మిక మృతి



చక్రవర్తి (ఫైల్)

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన రైల్వే ఉద్యోగి (గుత్తి డీజిల్ షెడ్‌లో ఎలక్ట్రికల్ శాఖలో టెక్నీషియన్) బీఆర్ చక్రవర్తి (40) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. చక్రవర్తి మృతిపై రైల్వే ఉద్యోగులు సంతాపం ప్రకటించారు. అతడి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

ఘనంగా ఆరాధనోత్సవం



సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న
పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. భ్రూణ హత్యలు, గర్భస్రావం దేవుడికి వ్యతిరేకమన్నారు. పిల్లలు దేవుడు, తల్లిదండ్రులకు విధేయులై ఉండాలన్నారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ఫలప్రదమవుతాయన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని గుడ్డాలపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా కల్లూరుకు మండల కేంద్రానికి చెందిన నందకుమార్ శర్మ అనే వ్యక్తి పూజారిగా పని చేస్తున్నారు. అనంతపురంలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లడానికి ఉదయం కర్నూలు నుంచి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. గుడ్డాలపల్లి క్రాస్ వద్ద రాజస్థాన్‌కు చెందిన లారీ ద్విచక్రవాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఢీకొనడంతో నందకుమార్ శర్మ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108లో క్షతగాత్రున్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

టెంకాయి పందేలపై దాడులు

యల్లనూరు: మండలంలోని కల్లూరు గ్రామంలో టెంకాయి పందేలపై పోలీసులు దాడులు చేశారు. సమాచారం మేరకు టెంకాయి పందేలు నిర్వహిస్తున్న సమయంలో ఎస్ఐ శ్రీరాం ప్రసాద్ తన సిబ్బందితో దాడులు చేయగా 14 బైకులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు పరారయ్యారు. ఘటనపై డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబులు విచారణ చేపట్టారు.

సేవ చేయకనే శిథిలం

- నిరుపయోగంగా రోడ్డు స్వీపింగ్ వాహనాలు
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా
- మూడు నెలలుగా మరమ్మతులకు నోచుకోని బాబ్‌కాట్, జేసీబీ

గుంతకల్లుటౌన్: ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలను అందించడమే లక్ష్యంగా రూపొందించిన స్వచ్ఛభారత్–క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) కార్యక్రమ లక్ష్యాలు మున్సిపల్ శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రోడ్లను శుభ్రం చేయడానికి స్వచ్ఛభారత్ కింద గుంతకల్లు మున్సిపాలిటీకి కేటాయించిన లక్షలాది రూపాయలు విలువ చేసే రెండు రోడ్డు స్వీపింగ్ వెహికల్స్‌ను అధికారులు మూలన పడేశారు. స్వీపింగ్ వెహికల్స్ వచ్చిన మూడు నెలపాటు పట్టణంలోని మెయిన్ రోడ్డును శుభ్రం చేయడానికి వినియోగించారు. డ్రైవర్ల కొరత, మరమ్మతులు, అరిగిపోయిన బ్రష్‌లు మార్చలేక, నిర్వహణ సక్రమంగా చేయని కారణంగా వాహనాలు నిరుపయోగంగా మారాయి. వాహనాలకు సంబంధించిన పలు స్పేర్ పార్ట్‌లు తుప్పు పట్టి సేవ చేయకనే శిథిలమవుతున్నాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. అంతేకాకుండా లక్షల విలువ చేసే రెండు బాబ్‌కాట్ వాహనాలు, ఒక జేసీబీ కూడా మరమ్మతులకు నోచుకోక మూడు నెలలుగా మూలనపడేశారు. దీంతో జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జేసీబీలను అద్దెకు తీసుకుని లక్షలాది రూపాయల బిల్లులను కాంట్రాక్టర్‌లకు చెల్లించే బదులుగా కొత్త జేసీబీని కొనుగోలు చేయాలని కౌన్సిల్ సభ్యులు సూచిస్తున్నా ఇంజినీరింగ్ అధికారులు మాత్రం దాటవేత ధోరణి అవలంభిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు స్వీపింగ్ వెహికల్స్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రభుత్వ లక్ష్య సాధనకు కృషి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



తిమ్మనచెర్ల వాటర్ ట్యాంక్ ఆవరణలో
మూలనపెట్టిన రోడ్డు స్వీపింగ్, బాబ్‌కాట్ వాహనాలు



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో
నిరుపయోగంగా రోడ్డు స్వీపింగ్ వాహనం

వినియోగంలోకి తెస్తాం

బాబ్‌కాట్, జేసీబీలు మూడు నెలలుగా మరమ్మతులకు నోచుకోలేదు. మరమ్మతుల కోసం ఎస్టిమేషన్ రెడీ చేయించాలని నా కంటే ముందున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నోట్ పెట్టారు. మరమ్మతులు పూర్తవ్వగానే వాటిని వినియోగంలోకి తీసుకువస్తాం. అలాగే రోడ్డు స్వీపింగ్ మిషన్లను వినియోగించేలా చూస్తాం.

– హరినాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

పుట్లూరు: మండలంలో సోమవారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పుట్లూరు ఆదర్శ పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాల ద్వారా విద్యార్థులకు సేవలు అందజేస్తామన్నారు.

నేటి నుంచి రీ సర్వే

పామిడి: పామిడిలోని ఆర్అండ్‌బీ స్థలాల ఆక్రమణలతో పాటు మండలంలో 10 గ్రామాల్లో నిర్వహించిన రీ సర్వేపై సర్వేయర్ల బృందం రీ సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ ఎస్.శ్రీధరమూర్తి ఆదివారం తెలిపారు. మండల వీర్వోలు, సర్వేయర్లు రెండు బృందాలుగా ఏర్పడి ఆర్అండ్‌బీ ఆక్రమణలతో పాటు రీ సర్వే గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామన్నారు. సర్వే నివేదికల ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో రీ సర్వే గ్రామాల్లో ఉత్పన్నమైన సమస్యలతో పాటు రోడ్లపై అక్రమ కట్టడాల యజమానులకు నోటీసులిచ్చి కూల్చివేస్తామన్నారు. మండల ప్రజలు సహకరించాలన్నారు.

కారును ఢీ కొన్న బైక్

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డు చెరువు కట్ట వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గుత్తి నుంచి గుంతకల్లుకు వెళ్తున్న కారును వెనుక నుంచి బైక్ ఢీ కొంది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అయితే కారు పాక్షికంగా దెబ్బతినింది. కాసేపు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వ బెదిరింపులకు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పెదవడుగూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. మండలంలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. టీడీపీ నాయకులు, తదితరులు ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా భయపడాల్సిన పనిలేదన్నారు. చట్టబద్ధంగా ముందుకెళ్దామని సూచించారు. వీలైతే అధికారుల వద్దకు వచ్చి మాట్లాడుతానన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. పోలీసుల నుంచి ఏమైనా ఒత్తిళ్లు ఉన్నా.. ఉన్నతాధికారులతో మాట్లాడుతామన్నారు. ఎంత ఇబ్బంది వచ్చినా ధైర్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

వేడుకల్లో భాగస్వామి కావడం అదృష్టం





మాట్లాడుతున్న బిషప్ రెవరెండ్ ఐజక్ వర ప్రసాద్ , ఆరాధన, ప్రార్థనకు హాజరైన క్రైస్తవులు

గుత్తి: సీఎస్ఐ టౌన్ చర్చి శత వసంతాల వేడుకల్లో భాగస్వామి కావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని రాయలసీమ డయాసిస్ బిషప్ రెవరెండ్ ఐజక్ వర ప్రసాద్ అన్నారు. గుత్తి పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చి శత వసంతాల వేడుకలు రెండు రోజులుగా ఘనంగా నిర్వహించిన విషయం తెలిసిందే. మూడో రోజు(ముగింపు) ఆదివారం సీఎస్ఐ చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరాధన, 27 మంది క్రైస్తవ యువకులకు నిర్ధారణ ప్రక్రియ, ప్రత్యేక ప్రార్థనలు , అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన రాయలసీమ బిషప్ మాట్లాడారు. చర్చి శత వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించడం, తనను ముఖ్య అతిథిగా పిలవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ సాలొమన్, కమిటీ నాయకులు, సభ్యులు సురేంద్ర బాబు, రస్సెల్ కిరణ్, మనోరంజిత, జేమ్స్, దయానంద్,కిరణ్ సుశీల్ కుమార్, మాధురి దేవి, షీబా కవిత, వినోద్ పాల్, దివ్యతేజ, గ్రేస్ , జాన్ సునీల్, విజయ కుమార్,నీలిమా ,ప్రేమ్‌కిరణ్, రీగన్, డేవిడ్, ప్రశాంత్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

కోటంకలో వైభవంగా లక్ష దీపోత్సవం





గార్లదిన్నె: కోటంకలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ప్రాంగణంలోని శివలింగాల వద్ద కార్తీక దీపాలు వెలగిస్తున్న మహిళలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో లక్ష దీపోత్సవాన్ని ఆదివారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రామాచార్యులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు లక్ష దీపోత్సవ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా మహిళలు, భక్తులు తరలివచ్చారు. మహిళలు కార్తీక దీపాలు వెలగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఈఓ ఈశ్వరరెడ్డి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు

పెద్దపప్పూరు: కార్తీకమాసం మూడోఆదివారం సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కోర్కెలు నెరవేరిన భక్తులు నారాయణస్వామి, చక్రభీమలింగేశ్వరులకు అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించి, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ సుబ్రమణ్యం, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు సహస్ర దీపాలంకరణ సేవ

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహిస్తున్నట్లు ఈఓ ఏ క్రిష్ణయ్య, ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వర శర్మ ఆదివారం తెలిపారు. కార్తీకమాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

ముస్తాబైన శివాలయాలు

యల్లనూరు: మండలంలోని నిట్టూరు, యల్లనూరు, కల్లూరు, చింతకాయమంద, వేములపల్లి, పెద్దమల్లేపల్లి తదితర గ్రామాల్లో శివాలయాలను ముస్తాబు చేశారు. కార్తీకమాసం మూడో సోమవారం కావడంతో భక్తులు పెద్దఎత్తున హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



గార్లదిన్నె: అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



పెద్దపప్పూరు: అలంకరణలో శింగరబట్లు, గణపతి, నారాయణస్వామి



గార్లదిన్నె: కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాత్రి సమయాల్లోనే గూడ్స్ వాహనాలకు అనుమతి



మాట్లాడుతున్న సీఐ మనోహర్

గుంతకల్లుటౌన్: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా సరుకు రవాణా చేసే వాహనాలను రాత్రి సమయాల్లో మాత్రమే అనుమతిస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం వన్‌టౌన్ పీఎస్‌లో ఆయన పట్టణంలోని హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. సరుకు ఎగుమతి, దిగుమతి రాత్రి 10 గంటల తరువాత జరిగేలా చూడాలన్నారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలని వ్యాపారులను సీఐ కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్ఐ శరత్‌చంద్ర

శింగనమల: సైబర్ నేరగాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శరత్‌చంద్ర సూచించారు. ఆదివారం మండలంలోని కల్లుమడి గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ చేసి అడిగితే బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలు చెప్పొద్దన్నారు. రోడ్డు భద్రత, మహిళలకు సంబంధించి నేరాలు, కేబుల్ చోరీలపై అవగాహన కల్పించారు. బస్టాండ్ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు మరువలేనివి



విలేకరులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

యాడికి: జర్నలిస్టుల సేవలు మరువలేనివని రాయలచెరువు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి రాయల చెరువు గ్రామంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో మండలంలోని పత్రికా విలేకరు లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, విలేకరులు పాల్గొన్నారు.

ఆలస్య జనన ధ్రువీకరణ పత్రంపై అవగాహన

పామిడి: ఆలస్యపు జనన ధ్రువీకరణ పత్రం పొందే విధానాల ప్రక్రియపై ఎంపీడీఓ తేజోత్స్న ఆదివారం అవగాహన కల్పించారు. ఒక సంవత్సరం తర్వాత జనన నమోదుకు ఆర్డీఓ అనుమతి తప్పనిసరి అన్నారు. మీ సేవ (లేదా) సచివాలయం ద్వారా నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు ఆధార్‌కార్డు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, అడ్వకేట్ నోటరీ, నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్, బోనాఫైడ్ (లేదా) స్టడీ (లేదా) ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. దరఖాస్తును వీఆర్వో పరిశీలించాక ఆర్ఐ ద్వారా తహసీల్దార్‌కు చేరుతుందన్నారు. ఆయన పరిశీలించాక ఆర్డీఓకు పంపుతారన్నారు. ఆయన పరిశీలన అనంతరం జనన నమోదుకు ఉత్తర్వులు జారీ చేస్తారన్నారు. నాన్ అవైలబిలిటీ, ధ్రువీకరణ పత్రాలకు ఏడు రోజుల చొప్పున మొత్తం 14 రోజులు సమయం పడుతుందన్నారు. ఆర్డీఓ ఉత్తర్వుల కోసం 60 రోజులతో కలిపి మొత్తం 74 రోజులు పడుతుందన్నారు. ఆయన ఉత్తర్వులను స్థానిక పంచాయతీ అధికారులు పరిశీలించాక జనన ధ్రువీకరణ పత్రం అందజేస్తారన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం పెంపొందించుకోవచ్చు



గుంతకల్లులోని గ్రంథాలయంలో
పద్యాలు వినిపిస్తున్న కవి కొండారెడ్డి



గార్లదిన్నె గ్రంథాలయంలో
పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గుంతకల్లుటౌన్/గార్లదిన్నె: జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందని విశ్రాంత తెలుగు అధ్యాపకుడు, కవి డాక్టర్ కొండారెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గుంతకల్లులోని ప్రభుత్వ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కమ్మన్న, సిబ్బంది హేమలత, రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే కథల పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శిరీష, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల విభాగానికి హాజరుకండి

యల్లనూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదిస్తానన్నారు.

26న కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఈ నెల 26న నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు శుక్రవారం తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు రెండు పాస్ ఫోటోలు తెచ్చుకోవాలన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని సజ్జలదిన్నె సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.22 వేలను స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన మల్లిమోహన్, గంగాధర్, సజ్జలదిన్నెకు చెందిన గురుభాస్కర్, వెంకటనారాయణలను అరెస్టు చేసి, కేసు నమోదు చేశామన్నారు.